
సాక్షి నంద్యాల

ఆదివారం । 12 । నవంబర్ । 2023



మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: క్షేత్రానికి శనివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



14 నుంచి కార్తీక ఉత్సవాలు

బనగానపల్లె: యాగంటి క్షేత్రంలో ఈ నెల 14 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. 26న ఆకాశ మహాదీపోత్సవం జరగనుంది.



జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

ఉద్యోగులకు, ప్రజలకు అన్ని విధాలామేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు.

2లో▸

న్యూస్‌రీల్

కార్తీక మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈఓ పెద్దిరాజు, చైర్మన్ చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు సిబ్బందిని ఆదేశించారు. కార్తీకమాసోత్సవాల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. క్యూలైన్లు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్రదర్శన కౌంటర్లు, పార్కింగ్ ప్రదేశాలు, టూరిస్ట్ షెడ్స్, కల్యాణకట్ట, డార్మెటరీ, గణేశ సదనం తదితర వాటిని సందర్శించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మాట్లాడుతూ క్యూకాంప్లెక్స్‌లోని భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు, అందజేస్తుండాలని, క్యూలలో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాలు, ఆయా పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవలసిన దారులు స్పష్టంగా తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాతాళగంగ మెట్ల మార్గంలోని డార్మెటరీల దారి తెలిసేవిధంగా పలు చోట్ల సూచికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా రోజులలో దర్శనం వేళలు, దర్శనానికి పట్టే సమయం తదితర సమాచారాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వార నిరంతరం తెలియజేస్తుండాలని ఈఓ సూచించారు. కార్తీకమాసాన్ని దృష్టిలో ఉంచుకుని రథశాలకు కుడివైపున శివవీధిలో చలువ పందిర్లు వేయాలని ఆదేశించారు. వారి వెంట ఏఈఓ ఫణిదర ప్రసాద్, ఎం. హరిదాసు, పర్యవేక్షకులు టి. హిమబిందు, అయ్యన్న, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.2.41 లక్షలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుండే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.2,41,645 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. కర్నూలు పట్టణం బుధవారపేటకు చెందిన రాజశేఖర్ 20 గ్రాముల బంగారం గొలుసు వితరణ చేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతకు తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

రైతుకు ‘బహుళ’ సేవలు

- అందుబాటులో బహుళ ప్రయోజన కేంద్రాలు
- నంద్యాల జిల్లాలో 144 గోదాముల నిర్మాణాలు
- రూ. 77.40 కోట్ల ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రెండో దశలో 26 నిర్మాణాలకు ప్రతిపాదనలు
- పంటల నిల్వకు తొలగనున్న ఇబ్బందులు

రైతుల రెక్కల కష్టం ఇక వృథాగా పోదు. రేయింబవళ్లు కష్టించి పండించిన పంటను గిట్టుబాటు ధరకే అమ్ముకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గోదాములు నిర్మిస్తోంది. వీటికి బహుళ ప్రయోజన కేంద్రాలుగా నామకరణం చేసింది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అనుబంధంగా నిర్మిస్తున్న ఈ గోదాములు జిల్లాలో చాలా వరకు పూర్తయ్యాయి. కొన్ని సేవలు కూడా అందిస్తున్నాయి. మరికొన్ని త్వరలో అందుబాటులోకి రానున్నాయి.



కొత్తపల్లి మండలం గోకవరం పంచాయతీ పరిధిలో నిర్మాణం పూర్తయిన బహుళ ప్రయోజన కేంద్రం



పాములపాడు మండలం భానుముక్కల గ్రామం వద్ద నిర్మాణం పూర్తి చేసుకున్న బహుళ ప్రయోజన కేంద్రం

నందికొట్కూరు: ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని, చీడపీడలను నివారించుకుని పంట పండించడం కత్తి మీద సాము అయితే.. మార్కెట్లో సరైన ధరకు పంటను అమ్ముకోవాలంటే అంతకు మించి కష్టాన్ని రైతు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ కష్టాన్ని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు అనుబంధంగా బహుళ ప్రయోజన కేంద్రాలు (ఎంపీఎఫ్ఎస్) ఏర్పాటు చేస్తోంది. ఖరీఫ్ సీజన్ నాటికి వీటి నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 144 ఎంపీఎఫ్ఎస్‌లకు గాను ఇప్పటికే 132 పూర్తయ్యాయి. మిగిలినవి తుది దశలో ఉన్నాయి.

ప్రయోజనాలు ఎన్నో..

బహుళ ప్రయోజన కేంద్రాలు ప్రాథమికంగా గోదాములుగా ఉపయోగపడనున్నాయి. పంట చేతికి రాగానే అమ్ముకోకుండా మార్కెట్‌లో తగిన ధర వచ్చే వరకు ఈ గోదాముల్లో రైతులు నిల్వ చేసుకోవచ్చు. ఈ కేంద్రాల్లో పంటలో తేమ శాతాన్ని కొలిచే పరికరాలు ఉంటాయి. అలాగే వేయింగ్ మిషన్లు అందుబాటులో ఉంచుతారు. ఇందులో కంప్యూటర్లు కూడా ఉంటాయి. రైతులకు అవసరమైన టార్పాలిన్లు ఈ కేంద్రాల నుంచి తీసుకోవచ్చు. పంట నాణ్యత ప్రమాణాలను గుర్తించే ల్యాబ్ పరికరాలు ఇక్కడ ఉంటాయి. ఈ కేంద్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి.

సామర్థ్యమిదీ..

నంద్యాల జిల్లాలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 66 గోదాములు, 500 టన్నుల సామర్థ్యం కలిగిన 78 గోదాముల నిర్మాణం చేపట్టారు. ఒక్కో గోదాముకు 15 సెంట్ల భూమిని ఎంపిక చేసి మార్కెటింగ్ శాఖకు అప్పగించారు. సంబంధిత కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ పూర్తయ్యాక పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. నెలవారీ లక్ష్యాలను నిర్ణయించి మరీ పనులు శరవేగంగా జరిగేలా మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. జిల్లాలో 132 గోదాముల నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఖర్చు ఇలా..

గ్రామస్థాయిలో మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా 144 బహుళ ప్రయోజన కేంద్రాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 77.40 కోట్లు ఖర్చు చేస్తోంది. తొలిదశలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 66 గోదాముల నిర్మాణాలకు రూ. 46.20 కోట్లు విడుదల చేసింది. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ. 70 లక్షల నిధులను ఖర్చు చేస్తున్నారు. అలాగే 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 78 గోదాములను రూ. 31.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ. 40 లక్షలు వెచ్చిస్తున్నారు. రెండోవ దశలో 26 బహుళ ప్రయోజన కేంద్రాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నిల్వకు అభయం



టీడీపీ హయాంలో రైతులను పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం రైతులను ఆదుకుంటోంది. మేం 13 ఎకరాల్లో వరి సాగు చేశాం. పండిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం గోదాములను నిర్మించింది. పంట రాగానే అమ్ముకోకుండా నిల్వకు భయం లేకుండా ప్రభుత్వం భరోసా కల్పించింది.

– రామచంద్రారెడ్డి, బండిఆత్మకూరు

చాలా సంతోషం



జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతోంది. గతంలో పంట నిల్వ ఉంచేందుకు గోదాములు ఉండేవి కాదు. వెంటనే దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుని నష్టపోయే వాళ్లం. ఇప్పుడు గోదాములు అందుబాటులోకి రానుండటం చాలా సంతోషంగా ఉంది. మేం ఐదెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాం.

– బాలునాయక్, భానుముక్కల, పాములపాడు మండలం

త్వరలోనే అన్ని గోదాములు అప్పగిస్తాం



జిల్లాలో తొలిదశలో 144 గోదాములకు గాను 132 నిర్మాణాలను పూర్తి చేశాం. నెలవారీ లక్ష్యాలను నిర్దేశించి, నిర్ణీత సమయానికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. బండిఆత్మకూరు మండలంలోని సంతజూటూరు, పరమటూరు, పెద్దదేవలాపురం, బండి ఆత్మకూరు గోదాములను సొసైటీలకు అప్పగించాం. మిగతా 140 గోదాములను సొసైటీలకు త్వరలోనే అప్పగిస్తాం.

– శ్రీనివాసులు, నంద్యాల జిల్లా సహకార సొసైటీ అధికారి

అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం



విద్యార్థినికి మెమొంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్‌మాబున్నీసా, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నౌమాన్

నంద్యాల: విద్యా రంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనార్టీల సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్‌కలాం చిత్రపటానికి ఎమ్మెల్యే శిల్పా రవి, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డా.నౌమాన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్ భారత దేశానికి మొదటి విద్యా మంత్రిగా పని చేశారన్నారు. స్వాతంత్ర్యానంతరం గ్రామీణ పేదలు, బాలికల విద్య, వయోజన, అక్షరాస్యత, 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత సార్వత్రిక ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, వృత్తిపరమైన శిక్షణతో సహా వివిధ రంగాలపై అబుల్ కలాం ఆజాద్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఆయన మార్గంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా నంద్యాలలో 18 మున్సిపల్ పాఠశాలలను నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. చదువుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో అమ్మఒడి పథకం ద్వారా రూ.15,000 అందించడంతో పేద కుటుంబాలకు ఎంతో ఊరట కలిగిందన్నారు. రూ.470 కోట్లతో నంద్యాల మెడికల్ కళాశాలను ప్రారంభించి మొదటి సంవత్సరం తరగతులను కూడా ప్రారంభించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. డీఆర్‌ఓ పుల్లయ్య మాట్లాడుతూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జఫ్రుల్లా, మూడవ పట్టణ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ చంద్రశేఖర్, ఎంఈఓ బ్రహ్మం, సాయిరాంరెడ్డి, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈనెల 13వ తేదీన తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం తెలిపారు. సోమవారం దీపావళి నేపథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం లేదన్నారు. తిరిగి వచ్చే సోమవారం స్పందన యథావిధిగా కొనసాగుతుందన్నారు.

ఆశలు ‘వరి’ంచి.. ప్రకృతి పరవశించి!

కరువు కాటేసినా వరి రైతుకు ప్రభుత్వం అండగా నిలిచింది. కేసీ నీటిని వారబందీ రూపంలో అందించి పైరు ఎండకుండా కాపాడింది. ఎర్రగుంట్ల–శిరువెళ్ల మధ్య సుమారు 10వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. కనుచూపు మేర పుడమి తల్లి పచ్చని కోక కట్టిన దృశ్యం అన్నదాత కష్టాన్ని కళ్లకు కడుతోంది. మరో నెల రోజుల్లో కోతలకు సిద్ధమవుతున్న ఈ పైర్లను చూసి ప్రకృతి పురివిప్పి ఆడుతోంది. నింగి నల్లని మబ్బులు కక్కుతూ నేలకు దూకేందుకు ఉరకలేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ఎర్రగుంట్ల సమీపంలో కోనసీమను తలపిస్తూ వరిపైరు



బంతిపూల సాగు



శిరువెళ్ల సమీపంలో పుడమికి పచ్చని కోక

క్లుప్తంగా

13న పోలీస్ స్పందన రద్దు

కర్నూలు: దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 13న సోమవారం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిన నేపథ్యంలో పోలీసు స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో అర్జీదారులు స్పందన కార్యక్రమానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలకు, పోలీసు యంత్రాంగానికి ఎస్పీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలులో 16 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి కర్నూలులో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి. లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు కర్నూలు బి. క్యాంపు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-19 విభాగంలో బాలబాలికలకు హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 18 నుంచి 23 వ తేదీ తేదీ వరకు అండర్-14, 17, 19 విభాగంలో రగ్బీ పోటీలు ఉంటాయని తెలిపారు. మిలటరీ కాలనీలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అండర్-17, 19 విభాగంలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెళ్లయిన ఆరు నెలలకే..

- ఎద్దుల బండి పల్టీకొట్టి వివాహిత మృతి



శివమ్మ (ఫైల్)

కౌతాళం: పెళ్లయిన ఆరు నెలలకే వివాహిత మృత్యు ఒడికి చేరింది. విధి వక్రీకరించి ఎద్దుల బండి రూపంలో మృత్యువు ఆమెను కబళించింది. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పొదలకుంట గ్రామానికి చెందిన శివమ్మకు సుళేకేరి గ్రామానికి చెందిన వీరేష్‌తో మే నెలలో వివాహమైంది. శనివారం ఉదయం దంపతులు ఇద్దరూ పత్తి తీయడానికి పొలానికి ఎద్దుల బండిలో వెళ్లారు. పొలం వద్ద ఎద్దుల బండి దిగుతుండగా ఒక్కసారిగా అది పల్టీ కొట్టింది. దీంతో శివమ్మ (19) కుడి చెయ్యి విరిగి, చెవిలో రక్తం వచ్చి అక్కడికక్కడే మృతి చెందింది. పెళ్లయిన ఆరు నెలలకే శివమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



డోన్ టౌన్: పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) మృతి చెందినట్లు స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని పరిసరాలను పరిశీలించి స్థానికులను విచారించారు. కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ అనారోగ్యంతో మృతి చెందినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కేసీలో శివ భక్తుడు గల్లంతు

కర్నూలు: జొహరాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ (40) కేసీ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. ఈయన పెయింటర్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల శివమాల ధరించాడు. అయ్యప్ప స్వామి గుడి వెనుక శనివారం తెల్లవారుజామున స్నానానికి వెళ్లి మెట్లపై అదుపు తప్పి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు కూడా దాదాపు కిలోమీటర్ పొడవునా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని తెలిసింది.



కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో బాణసంచా దుకాణాల వద్ద సందడి


నేడే దివ్యకాంతుల దీపావళి



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పెద్దలతోపాటు చిన్నారులు సైతం ఆనందంగా జరుపుకునే పండుగ దీపావళి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. ఆదివారం పండుగ రోజు దివ్యకాంతులతో లోగిళ్లన్నీ వెలుగులీననున్నాయి. వేడుకలకు ఉమ్మడి కర్నూలు జిల్లా ముస్తాబైంది. బాణసంచా దుకాణాల వద్ద జనసందోహం కనిపిస్తోంది. మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో దీపాలు, ప్రమిదల అమ్మకాలు ఊపందుకున్నాయి. పూలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



ప్రథమ పూజకు గణేశుని ప్రమిద



సంప్రదాయానికి పూర్ణకుంభ ప్రమిద



టపాసులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న దృశ్యం



కర్నూలులో బాణసంచా కొనుగోలు చేస్తున్న చిన్నారులు



దుకాణంలో విక్రయానికి ఉంచిన టపాసులు



విక్రయానికి ఉంచిన పూజా సామగ్రి

ముఖ్యమంత్రి వాల్మీకుల పక్షపాతి

- డిసెంబర్‌లో ఢిల్లీకి వీఆర్‌పీఎస్ బృందం
- వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకుల పక్షపాతిగా నిలిచారని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వీఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. వాల్మీకి/బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందన్నారు. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేసేందుకు డిసెంబర్ 4న వీఆర్‌పీఎస్ బృందం ఢిల్లీకి వెళ్లి మూడు రోజుల పాటు అక్కడే ఉంటుందన్నారు. ఎస్టీ రిజర్వేషన్ అంశాన్ని వివిధ రూపాల్లో కేంద్రం దృష్టికి తీసుకుపోతామన్నారు. గత 15 సంవత్సరాలుగా వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలను నిర్వహించామని, ఊపిరి ఉన్నంత వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు గిడ్డయ్య, ప్రధాన కార్యదర్శి జి రాంభీంనాయుడు, ఉపాధ్యక్షులు మల్లికార్జున, శేఖర్, ఉమామహేశ్వర, శ్రీను, నాయకులు ఖాశీం నాయుడు, డాక్టర్ రాఘవేంద్ర, నరేంద్ర, అనంతపురం జిల్లా నేత చీమల జయ, నెట్టేకల్ సర్పంచ్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం వ్యక్తం చేస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

సైకిల్ తొక్కుతూ.. ఆటలాడుతూ!

- కర్నూలుతో సినీ నటుడు చంద్రమోహన్‌కు అనుబంధం



కర్నూలు కల్చరల్: ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్‌కు కర్నూలుతో ప్రత్యేక అనుబంధం ఉంది. తన సొంత సోదరి కుటుంబం కర్నూలు నరసింహారెడ్డి నగర్‌లో నివాసం ఉండేది. ఆయన బావ బిర్లా ప్రొడక్ట్ వనస్పతి డాల్డా కంపెనీలో ఉద్యోగం చేసేవారు. తన 13 సంవత్సరాల వయసులో సెలవుల్లో ఆయన కర్నూలులోని తన అక్క బావల దగ్గరికి వచ్చేవారు. కర్నూలు వీధుల్లో స్నేహితులతో తిరుగుతూ ఆటలాడుకున్నారు. సైకిల్ తొక్కడం కర్నూలులోనే నేర్చుకున్నట్లు పలు సందర్భాల్లో ఆయన చెప్పేవారు. తనకు కర్నూలంటే ప్రత్యేక ఇష్టమని పేర్కొనే వారు. రైలులో ప్రయాణం చేస్తూ తుంగభద్రా నదిని వీక్షించడం మరిచిపోని అనుభూతిగా పేర్కొంటూ ఉండేవారు. హీరోగా, నటునిగా గుర్తింపు వచ్చాక 2007లో ఆయన కర్నూలు వీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఒక ఆయుర్వేద ఆస్పత్రిని ప్రారంభించారు. ఆయన మృతి సినీ కళా రంగానికి తీరని లోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ఉపాధ్యక్షులు ఇనాయతుల్లా పేర్కొన్నారు. చంద్రమోహన్ మృతికి సంతాపం ప్రకటించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే ఉద్యోగులకు, ప్రజలకు అన్ని విధాలా మంచి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సమాఖ్య(ఏపీజీఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి అన్నారు. కర్నూలులోని కళాక్షేత్రంలో శనివారం ఏపీజీఈఎఫ్ జిల్లా శాఖ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏపీజీఈఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు రఘుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరవపాల్, రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ బత్తుల అంకమరావు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా కాకర్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, ఉద్యోగుల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే..

- ప్రభుత్వం తెచ్చిన వలంటరీ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోంది.
- ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి, 10 వేల మందికిపైగా కుటుంబాల్లో వెలుగులు నింపారు.
- వీఆర్‌ఏలకు నెలకు రూ.300 ప్రకారం డీఏ కింద చెల్లిస్తున్న మొత్తాన్ని టీడీపీ హయాంలో రద్దు చేయగా.. దీనిని రూ.500 పెంచుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం త్వరలోనే జీవో తెస్తోంది.
- 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారు. ఇంకా 2000 మందికిపైగా మిగిలిపోయారు. వీరిలో కనీసం 700 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి చేస్తున్నా ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయి. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉంది.
- డిసెంబరు నెల చివరి లేదంటే జనవరి మొదటి వారంలో సీఎంకు సన్మాన కార్యక్రమం ఏపీజీఈఎఫ్ నిర్వహిస్తోంది.రెగ్యులర్ అవుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలిరావాలి.



మాట్లాడుతున్న ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి



హాజరైన ఉద్యోగులు

ఒకేసారి 1.34 లక్షల ఉద్యోగాలు



పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా యువతకు ఒకేసారి 1.34 లక్షల ఉద్యోగాలు కల్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని, వారందరూ ప్రభుత్వానికి అండగా నిలువాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకమరావు, ఏపీజీఈఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు రఘుబాబు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తమకు నమ్మకం ఉందని, అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ నగరశాఖ అధ్యక్షుడు గోవిందు, మాజీ అధ్యక్షుడు జయశంకర్‌రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్లమద్దయ్య, జిల్లా నాయకులు శ్రీనివాసులు, భాస్కరరెడ్డి, మల్లేష్, బీఆర్ఆర్ కిశోర్, నారపరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.